టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచనలిస్తున్న మేయర్ సుధారాణి

శిథిల భవనాలను త్వరగా గుర్తించాలి

- అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి
- మేయర్ సుధారాణి

వరంగల్, జూలై 10 : గ్రేటర్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న భవనాలను త్వరగా గుర్తించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న శిథిల భవనాలను గుర్తించి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా కూల్చివేయాలన్నారు. 4 నెలల పాటు సెల్లార్లలో నిర్మాణాలు జరుగకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నీటి నిల్వ ఉండే సెల్లార్లను గుర్తించి నీటిని బయటికి వెళ్లేలా మోటర్లను ఏర్పాటు చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సెల్లార్లలో విద్యుత్ ప్యానల్స్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనధికార లే అవుట్లు వేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇన్‌చార్జి అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి

వరంగల్, జూలై 10 : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చేపట్టిన అభివృద్ధి పనుల పూర్తికి ప్రత్యేక చొరవ చూపాలని కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి అన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా బుధవారం కుడా కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే, చీఫ్ ప్లానింగ్ అధికారి అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, కార్యదర్శి మురళీధర్‌రావు, ఏపీవో రామా రవీందర్, ఏవో సత్యనారాయణ పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో టీజీవోలు

మంత్రిని కలిసిన టీజీవోలు

హనుమకొండ, జూలై 10 : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఎన్నికలకు ముందు బదిలీపై వెళ్లిన రెవెన్యూ ఇతర డిపార్ట్‌మెంట్ ఉద్యోగులను వారి వారి జిల్లాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసారు. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పినట్లు టీజీవో ఉమ్మడి వరంగల్ జిల్లా కో ఆర్డినేటర్ జగన్‌మోహన్‌రావు తెలిపారు. అలాగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా టీజీవో భవనానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్ మోహన్ రావు, రాష్ట్ర బాధ్యులు పరమేశ్వర్‌రెడ్డి, యాదగిరి, ఈగ వెంకన్న ఉన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

- మీ సేవ కేంద్రాలు, డెయిరీఫామ్‌ల కేటాయింపు
- కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, జూలై 10 : గ్రామీణ ప్రాంత మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖల అధికారులతో మహిళా శక్తిపై ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో మహిళలకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో ఈ సంవత్సరం రూ.133 కోట్లు ఖర్చుపెట్టినట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు మీసేవ కేంద్రాలు, డెయిరీ ఫామ్‌లు పెట్టిస్తామని, ఇప్పటికే మహిళా సంఘాల ద్వారా ఏకరూప దుస్తులు కుట్టించామని చెప్పారు. మహిళా సంఘాలకు ఏం పథకాలు ఉన్నాయో వివరించారు. వ్యక్తిగతంగా కాకుండా సమష్టిగా ఆలోచించి ఎక్కువ నిధులను పొంది యూనిట్లపై ఖర్చు పెట్టాలని సూచించారు. ఈ సమావేశం మహిళలు తమ ఆలోచనలు వివరించడానికి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల స్థాయిలోని కమిటీల ద్వారా వారి అభిప్రాయాలను తెలియజేస్తే అందుకు అనుగుణంగా జిల్లా స్థాయిలో చర్చించి అమలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన యూనిట్లు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. మహిళా శక్తి పథకం ద్వారా 14 పథకాలు ఉన్నట్లు తెలిపారు. మహిళా శక్తి కింద తయారు చేసే ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉండాలన్నారు. ఇచ్చిన టార్గెట్‌ను చేరుకోవాలని, వారం రోజుల్లో యూనిట్లు ఎంపిక చేయాలని, ఎంపికైన వారికి ట్రైనింగ్ ఇచ్చి సమర్థులుగా తయారు చేయాలన్నారు. కొత్త యూనిట్లు ఆగస్టు మొదటి వారంలో ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఆర్‌డీవో నాగపద్మజ, ఎల్డీఎం శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీనివాస్, మెప్మా అధికారి రజినీరాణి, వ్యవసాయ శాఖ అధికారి దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ఆగస్టు రెండో వారంలో పూర్తి చేస్తాం..

రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణలో బాధితులకు చెల్లించే పరిహారం విషయంలో మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి మంచిర్యాల -వరంగల్ - ఖమ్మం - విజయవాడ కారిడార్ రోడ్డు భూ సేకరణపై ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఈ హైవే కారిడార్ హనుమకొండ జిల్లాలో 30 కిలోమీటర్లు ఉందని, 141 మందికి పాస్ అవార్డు చేశామని, ధరల వ్యత్యాసం వల్ల రైతుల భూమి ఇచ్చేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఆగస్టు రెండో వారంలోగా ఆర్బిట్రేషన్, స్ట్రక్చర్ పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఎఫ్‌వో లావణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఆటగాడికి ఆర్థికసాయం

హనుమకొండ : ఏషియన్ జూనియర్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఎన్నికైన హ్యాండ్‌బాల్ క్రీడాకారుడికి బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రబెల్లి జగన్‌రావు రూ. 51,116 ఆర్థికసాయం అందజేశారు. హనుమకొండకు చెందిన బొమ్మరాజు శివాజీ ఈ నెల 14 నుంచి జోర్డాన్ దేశంలోని అమ్మాన్‌లో జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శివాజీ కలెక్టర్ ప్రావీణ్యను కలిశారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ద్వారా శివాజీకి బుధవారం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ కోచ్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

క్రీడాకారుడు శివాజీకి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఆర్టీసీ డ్రైవర్లకు కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీశ్

ఆర్టీసీ డ్రైవర్లకు కొత్త చట్టాలపై అవగాహన

సుబేదారి, జూలై 10 : వరంగల్ రీజియన్ ఆర్టీసీ డ్రైవర్లకు హనుమకొండ బస్‌స్టేషన్‌లో మంగళవారం హనుమకొండ పోలీసులు కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సతీశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తీసుకువచ్చిన కొత్త చట్టాలపై ఆర్టీసీ డ్రైవర్లు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు ఎవరైనా చనిపోతే బస్సు ఆపకుండా వెళ్తే పదేళ్ల జైలు శిక్ష ఉంటుందని అన్నారు.

కురుకుల్లా అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

కురుకుల్లా అలంకరణలో భద్రకాళీ

ఐదో రోజు శాకంబరీ ఉత్సవాలు

వరంగల్, జూలై 10 : భద్రకాళీ శాకంబరీ నవరాత్రోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం ఐదో రోజు ఉదయం అమ్మవారిని కురుకుల్లా క్రమంలో అలంకరించారు. సాయంత్రం భేరుండా అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, నిత్యాహ్నికం, క్షీరాన్నం నివేదించారు. భద్రకాళీ అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

మహిళలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ

దామెర, జూలై 10 : మండలంలోని ఊరుగొండ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో సఖీ వన్‌స్టాప్ కేంద్రం నిర్వాహకులు మహిళలు, ఆశ కార్యకర్తలకు చట్టాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేస్‌వర్కర్ వినీల మాట్లాడుతూ.. మహిళలపై లైంగిక, వరకట్న వేధింపులను నిరోధించేందుకు సఖీ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్ఎం పద్మ, సఖీ కేంద్రం నిర్వాహకులు కల్యాణ్, స్వర్ణలత, మానస తదితరులు పాల్గొన్నారు.

డీఈవో వాసంతి బాధ్యతలు స్వీకరణ

హనుమకొండ చౌరస్తా, జూలై 10 : హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారిగా వాసంతి నియమితులయ్యారు. బుధవారం ఆమె ఇన్‌చార్జి డీఈవో చలపతిరావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానని డీఈవో వాసంతి తెలిపారు. ఆమె వరంగల్ డీఈవోగా కూడా కొనసాగుతున్నారు.

డీఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న వాసంతి

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలలో నోట్ బుక్స్ పంపిణీ

హసన్‌పర్తి, జూలై 10 : రోటరీ క్లబ్ హనుమకొండ ఆధ్వర్యంలో మండలంలోని జయగిరి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నోట్ బుక్కులు పంపిణీ చేశారు. మహిపాల్ రెడ్డి రూ.30 వేలు వెచ్చించి నోట్‌బుక్స్ విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, అంచూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆగని పీడీఎస్ బియ్యం దందా..

- యథేచ్ఛగా వరంగల్ టు మహారాష్ట్ర రవాణా
- నగరంలోని నిర్మానుష్య ప్రాంతాల్లో డంపింగ్, రాత్రివేళ షిప్పింగ్

సుబేదారి, జూలై 10 : ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం పక్కదారి పడుతున్నది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో రేషన్ బియ్యం దందా విచ్చలవిడిగా కొనసాగుతోంది. కొన్ని ముఠాలు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని పెద్ద ఎత్తున రేషన్ బియ్యాన్ని బయటి రాష్ట్రాలకు తరలిస్తున్నది. ఇటీవల హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట ప్రాంతంలో రూ.7లక్షల విలువైన 550 బస్తాల లారీ లోడ్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. ఈ లారీలో 280 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ దందా కొంత మంది పోలీసు, రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులను మేనేజ్ చేసుకొని నడిపిస్తున్నట్లు తెలుస్తున్నది. నగరంలోని నిర్మానుష్య ప్రాంతాల్లో బియ్యం డంప్ చేస్తూ రాత్రి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇటీవల హసన్‌పర్తి పరిధిలోని వంగపల్లి వద్ద డంపు చేసిన 85 క్వింటాళ్లు, చిల్పూరు మండలం రాజవరంలో రూ.4లక్షలకు పైగా విలువైన 178 క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెలిసిన రేషన్ లబ్ధిదారుల నుంచి కిలో రూ. 10 చొప్పున కొనుగోలు చేసి లారీల్లో ఇతర రాష్ట్రాలకు రవాణా చేసి అక్కడ రూ.50 చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిసింది. లోకల్‌గా కూడా కోళ్లఫారాలకు రూ.20 చొప్పున విక్రయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. రాత్రి సమయంలో కొనుగోలు ప్రాంతాల నుంచి ఆటోల్లో తరలించి నిర్మానుష్య ప్రాంతాలు, రైస్ మిల్లుల్లు, క్రషర్లలో డంప్ చేసి, అక్కడి నుంచి లారీల ద్వారా రాత్రి సమయంలో టార్గెట్ ప్రాంతాలకు రవాణా చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. రేషన్ డీలర్లు, కిరాణా షాపులు, లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం సేకరించడానికి ప్రత్యే క వ్యవస్థను తయారు చేసుకొని, వారికి కిలోకు రూ.2 చొప్పున కమిషన్ ఇచ్చి, అక్రమ దందాకు పాల్పడుతున్నారు.

అక్రమ రవాణాలో కొత్త పంథా..

వరంగల్ నగర శివారుకు చెందిన వ్యక్తి కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా పీడీఎస్ బియ్యం దందా కొనసాగిస్తున్నాడు. అక్రమ రవాణాలో అతడు కొత్త పంథాను ఎంచుకున్నాడు. కొంత మంది ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు అతడికి సహకరిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఎర్రగట్టు గుట్ట వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన లారీ కేసులో తరలిస్తున్న వ్యక్తులు అతడి అనుచరులే అని తెలిసింది. కొంత మంది పోలీసు అధికారులను మేనేజ్ చేసుకొని, వరంగల్, హనుమకొండ, జనగామ ప్రాంతాల్లో కొనుగోలు చేస్తూ భూపాలపల్లి, ములుగు, హనుమకొండ జిల్లాల్లోని ధర్మసాగర్, ఆత్మకూరు, పరకాల ప్రాంతాల్లోని క్రషర్స్, రైస్ మిల్లులు, నిర్మానుష్య ప్రాంతాల్లో డంపింగ్ చేసి, అక్కడి నుంచి తెలు గు రాష్ట్రాల కోళ్లఫారాలు, మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు



హసన్‌పర్తి : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలి

- సమానపనికి సమాన వేతనం ఇవ్వాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా

హనుమకొండ, జూలై 10 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆలకుంట్ల యాకయ్య అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి బొల్లారం సంపత్ మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యాసబాబు, సుధాకర్, రవి, మంజుల, శ్రీలత, శారద, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను నిలిపివేయాలి

ఐనవోలు/హసన్‌పర్తి : సీఐటీయూ అనుబంధ సంఘాల కార్మికులు తహసీల్దార్ విక్రమ్ కుమార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం బుధవారం అందజేశారు. సీఐటీయూ నాయకుడు రామ్‌కుమార్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వెంటనే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు విరమించుకోవాలని కోరారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని రద్దు చేయాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కనీసవేతనం రూ.26 వేలు, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యోసేబు, రవి, శ్రీనివాస్, మహేందర్, రంజిత్, యాకయ్య, ఎలీషా ఉన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పుల్ల అశోక్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని హసన్‌పర్తి తహసీల్దార్ చల్లా ప్రసాద్, ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం ఇచ్చారు.



ఐనవోలు : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లబ్ధిదారులకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే నాగరాజు

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

హసన్‌పర్తి, జూలై 10 : హసన్‌పర్తిలోని టీటీడీసీ సమావేశ మందిరంలో తహసీల్దార్ చల్లా ప్రసాద్ అధ్యక్షత వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 60మంది లబ్ధిదారులకు రూ.80,09,280 విలువైన చెక్కులను అందజేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు ఆడపిల్లల పెండ్లి భారం తగ్గిందన్నారు. హసన్‌పర్తిలో మినీ ఇండోర్ స్టేడియాన్ని మంజూరు చేయించానన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్లు జక్కుల రజితావెంకటేశ్వర్లు, గుగులోత్ దివ్యరాణీ రాజునాయక్, వరుణగంటి అరుణ, ప్యాక్స్ చైర్మన్లు బిల్లా ఉదయ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకపు ఉత్తర్వులు ఇప్పించండి..

ఐనవోలు, జూలై 10 : వారసుల నియామకపు ఉత్తర్వులను ఇప్పించాలని కోరుతూ వీఆర్ఏలు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును బుధవారం వర్ధన్నపేటలో కలిసి వినతిపత్రం అందజేశా రు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రమేశ్, రాజు, వేణు, రాజు ఉన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

వరంగల్, జూలై 10 : హనుమకొండ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ వద్ద మిషన్ భగీరథ వాల్వ్ మరమ్మతుల పనులు కొనసాగుతున్న క్రమంలో గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలివేస్తున్నట్లు బల్దియా ఈఈ రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రం, శ్రీనివాస కాలనీ, అడ్వకేట్ కాలనీ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

అర్చన, కృష్ణయ్యకు నియామక పత్రాలు అందజేస్తున్న రిజిస్ట్రార్

సీఎస్ఈ పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలిగా అర్చన

హనుమకొండ చౌరస్తా, జూలై 10 : కేయూ కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పాఠ్య ప్రణాళిక నూతన అధ్యక్షురాలిగా విభాగ సహాయ ఆచార్యులు అర్చనను నియమిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అర్చన ప్రస్తుత పాఠ్యప్రణాళికా అధ్యక్షురాలు పద్మజ నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. అర్చన 2010లో విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులుగా ప్రవేశించారు. గతంలో విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కాలేజీ కొత్తగూడెం హాస్టల్ సంయుక్త సంచాలకురాలిగా, కంప్యూటర్ సైన్సు ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగ ఇన్‌చార్జిగా పనిచేశారు. 15కు పైగా జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పత్రాలు సమర్పించారు.

సంస్కృత విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా కృష్ణయ్య..

కేయూ సంస్కృత విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా కాకతీయ ప్రభుత్వ డిగ్రీ సంస్కృత విభాగ అధ్యాపకుడు కృష్ణయ్యను నియమిస్తూ రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో 2 సంవత్సరాలు కొనసాగుతారు. ప్రస్తుత పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు, వడ్డేపల్లి ప్రభుత్వ పింగిలి కాలేజీ సంస్కృత అధ్యాపకురాలు రాజేశ్వరి నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు.

ముగ్గురికి సూపరింటెండెంట్లుగా ప్రమోషన్

కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు సూపరింటెండెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పించినట్లు రిజిస్ట్రార్ మల్లారెడ్డి వెల్లడించారు. పరీక్షల విభాగంలో పని చేస్తున్న ప్రతాప్, ఇంజినీరింగ్ కాలేజీ కో-ఎడ్యుకేషన్‌లో పని చేస్తున్న సదాశివుడు, అడ్మినిస్ట్రేషన్ నాన్-టీచింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న కృష్ణమూర్తి ఉన్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న గణేశ్

నన్ను ఎవరూ ఏం చేయలేరు..

- విద్యార్థితో దురుసుగా మాట్లాడిన హెచ్‌ఆర్ఎం హెచ్‌వోడీ
- వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ డిమాండ్

హనుమకొండ చౌరస్తా, జూలై 10 : 'నన్ను ఎవరూ ఏం చేయలేరు.. ఏం చేసుకుంటారో చేసుకోపోండి' అంటూ విద్యార్థులను కించపరిచే విధంగా మాట్లాడిన హెచ్‌ఆర్ఎం హెచ్‌వోడీ పెద్దమల శ్రీనివాస్‌రావుపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ కేయూ అధ్యక్షుడు గణేశ్ డిమాండ్ చేశారు. బుధవారం కేయూలోని న్యూపీజీ హాస్టల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు గురవుతున్నారని అడగడానికి వెళ్లిన హెచ్‌ఆర్ఎం సెకండియర్ విద్యార్థి, పీడీఎస్‌యూ నాయకుడు మర్రి మహేశ్‌పై దుర్భాషలాడిన శ్రీనివాస్‌రావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ నాయకులు రఘు, మహేశ్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

15 మందికి జరిమానా

సుబేదారి, జూలై 10 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 15మందికి రూ.23,400 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ముగ్గురికి జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

జంగా, ఇనుగాలకు పుష్పగుచ్ఛాలు అందజేత

సుబేదారి, జూలై 10 : కుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇనుగాల వెంకట్రామిరెడ్డిని టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హనుమకొండ రామకృష్ణకాలనీలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

టిప్పర్ల పట్టివేత

హసన్‌పర్తి, జూలై 10 : అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లను బుధవారం రాత్రి హసన్‌పర్తి పోలీసులు పట్టుకున్నారు. సీఐ సురేశ్ కథనం ప్రకారం.. మండలంలోని మడిపల్లి గ్రామ శివారులో మొరం తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా మేడిపల్లికి చెందిన దుమల నరేశ్, కోమటిపల్లికి చెందిన మైదమ్ అఖిల్, గోపాల్‌రావుపేట రామడుగుకు చెందిన కల్లెం రాంబాబుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

వ్యవసాయ భూమి అమ్మబడును



★12ఎ|| తరి పొలము, 10ఎ|| రాగడి, వీటికి నీటి సౌకర్యం కలదు. ముస్త్యాలపల్లి గ్రామం, నడికూడ మం||, హనుమకొండ జిల్లా. ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323325

PLOT FOR SALE

★1089 గజముల ప్లాట్, సర్వే నెం. 187, L.R.S. కూడా కట్టబడినది. దర్గా గ్రామం, కాజీపేట మండలం, ఆసక్తి గల వారు సంప్ర: పి.వసంత కుమార్ రెడ్డి, సెల్: 9652225908
NTW-323326

నలంద గోల్డెన్ ఆఫర్

★ఓపెన్ 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG. అక్టోబర్ పరీక్షల్లో 100% పాస్ గ్యారంటీ, 10th, ఇంటర్ ఫెయిల్ అయితే రీకౌంటింగ్ ద్వారా పాస్. ఫైన్‌తో అడ్మిషన్స్ కలవు. Ph: 8019383310.
NT-325878

CHANGE OF NAME

★I, AKKARAJU SAROJINI SWARAJYALAXMI, W/o. AKKARAJU SURYA PRAKASH RAO, R/o. H.No. 13-2-255/1, Mattewada, Warangal, T.S.,-506002, India, have Changed my Surname & Name to KARANAM SAROJINI and solemnly declare.
NTW-00

CHANGE OF NAME

★I, LINGAMPALLY MANJULA (New Name), previously called LINGAMPALLI MANJULA (Old Name), and residing at H.No. 2-6-1085, KLN Reddy Colony, Hanamkonda, Hanumakonda District- 506 001, T.S, India, and solemnly declare.
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565